క్లుప్తంగా

చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలి

చిన్నంబావి: జూరాల చివరి ఆయకట్టు ప్రాంతమైన చిన్నంబావి మండలంలో పలు గ్రామాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, నీటిని విడుదల చేయాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కృష్ణప్రసాద్ యాదవ్, తేజారెడ్డి ఇరిగేషన్ ఎస్ఈ సత్యశీలారెడ్డిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూరాల చివరి ఆయకట్టు ప్రాంతం కావడంతో సాగునీరు అందక వేరుశనగ, మినుములు, పప్పుశనగ పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంట చివరి దశలో ఉండడంతో రైతులకు చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం స్పందించి వెంటనే సాగునీటి విడుదల చేయాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. గోపాల్‌దిన్నె రిజర్వాయర్‌కు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు.

న్యూమోనియా లక్షణాలపై ఇంటింటి సర్వే



పాన్‌గల్: ఐదేళ్ల లోపు చిన్నారులకు న్యూమోనియా లక్షణాల గుర్తింపుపై వైద్య సిబ్బంది సోమవారం మండలంలోని చింతకుంట, మల్లాయిపల్లి గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించినట్లు మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు తెలిపారు. జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉన్న చిన్నారులను చలి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. దీంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటిస్తే రోగాలకు దూరంగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్తేరమ్మ, బుచ్చమ్మ, శ్యామల, సునీత తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా



అమరచింత: సోమవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ జ్యోతి పరుషియా తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి అధ్యక్షతన నిర్వహించిన మండల జనరల్ బాడీ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరయ్యారు. కానీ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరు కావడం లేదని, సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించాలని సమావేశాన్ని రెండు రోజుల పాటు వాయిదా వేశామన్నారు. వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

భూ పరిహారం అందించాలని వినతి

పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లి, శాగాపూర్ గ్రామాల్లో కేఎల్ఐ డీ–8 కాల్వల తవ్వకంలో భూములు కోల్పోయిన రైతులకు భూ పరిహారం మంజూరులో జాప్యం నివారించి, వెంటనే నిధులు విడుదల చేయాలని కోరుతూ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి కాల్వల్లో భూములు కోల్పోయిన దాదాపుగా 180 మంది రైతులకు ఎకరాకు రూ.5.80 లక్షల చొప్పున పరిహారం కోసం 8ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు పరిహారాన్ని అందించాలని, దీంతో పాటు జిల్లాలో కుర్వ, యాదవులకు సబ్సిడీపై గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని త్వరగా చేపట్టాలని కోరారు.

టూరిజం భవనాన్ని వినియోగంలోకి తేవాలి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న టూరిజం భవనాన్ని వినియోగంలోకి తేస్తూ, రంగనాథ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సోమవారం జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ తెలంగాణ రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని జెడ్పీటీసీ తెలిపారు.

పునాదులకే పరిమితం!

- అసంపూర్తిగా భవనాలు
- అరకొర నిధులతో ఏళ్లు గడుస్తున్నా సాగని పనులు



అయ్యవారిపల్లిలో నిరుపయోగంగా అంగన్‌వాడీ భవనం



శ్రీరంగాపురంలో పిల్లర్ల దశలో ఆగిన పాఠశాల భవనం

పెబ్బేరు రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో పలు శాఖలకు సంబంధించిన భవనాలు నిధుల లేమితో అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. సూగూరులోని సగర, యాదవ సంఘం కమ్యూనిటీ భవనం, శ్రీరంగాపురంలోని హరిజన్‌వాడ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం ప్రారంభించినా పనులు నిలిచిపోయాయి. అయ్యవారిపల్లిలో అంగన్‌వాడీ భవనం కోసం గతంలో రూ3 లక్షలు, శాఖాపూర్‌లో మహిళా సమాఖ్య భవనం, రంగాపూర్‌లో ఎస్సీ హమాలీ సంఘం భవనానికి రూ.3 లక్షల నిధులు మంజూరు చేశారు. కానీ నిధులు సరిపోకపోవడంతో నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ప్రజాధనం రూ.లక్షలు వెచ్చించినా.. బూడిదలో పోసినట్లయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అరకొర నిధులు మంజూరు చేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు ప్రత్యేక చొరవ చూపి మండలంలో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరారు.

నిధులు కేటాయించాలి

హరిజన్‌వాడలో అంగన్‌వాడీ భవనం 17 ఏళ్ల నుంచి అసంపూర్తిగా ఉంది. కొత్త వాటికి బదులు గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించి ఉపయోగంలోకి తేవాలి.

– రాఘవేందర్‌గౌడ్, అయ్యవారిపల్లి

రూ.లక్షలు ఖర్చు పెట్టినా..

మా గ్రామంలో సగర సంఘం భవనం పనులు ప్రారంభించి 12 ఏళ్ల అయినా అసంపూర్తిగా ఉంది. వివిధ గ్రామాల్లో భవనాలకు రూ.లక్షలు ఖర్చు చేసినా.. నిధులు సరిపోక అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతుంది. వాటికి సరిపోయే నిధులు కేటాయించి వినియోగంలోకి తేవాలి.

– శ్రీనివాసులు, సూగూరు

పనులు పూర్తి చేస్తాం..

మండలంలోని కొన్ని గ్రామాల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన వివిధ శాఖల భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయిస్తాం. కొన్నింటి పనులు ప్రారంభిస్తున్నాం. కొన్ని చోట్ల నిధులు ఉన్నా పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

– రమేష్‌నాయుడు, పీఆర్ ఏఈ

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- గోపాల్‌పేటలో మండల సర్వసభ్య సమావేశం
- భూములు కోల్పోయిన రైతులకు పరిహారం

గోపాల్‌పేట: గతంలో ఏం జరిగిందో తెలియదు కానీ.. ఇప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సంధ్య అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ మూడు నెలల పురోగతిని వివరిస్తూ మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారని, స్కావెంజర్లు లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్మికులతో పనులు చేయిస్తున్నామన్నారు. కొన్నిసార్లు విద్యార్థులే బడుల్లో ఊడుస్తున్నారని సభ దృష్టికి తెచ్చారు. వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ కల్పించుకొని బండపల్లి ప్రాథమిక పాఠశాలలో పురుగులతో ఉన్న బియ్యాన్ని వండి పిల్లలకు వండిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే కల్పించుకొని ఇలా ఎందుకు జరుగుతోందని ఎంఈఓను ప్రశ్నించారు. కాంట్రాక్టర్ బియ్యం సరిగా వేయడం లేదని చెప్పడంతో టీచర్ల కొరత, ఇతర సమస్యలు ప్రభుత్వం చూసుకుంటుందని, మీరు చేయాల్సిన పని సరిగా చేయండని ఆదేశించారు. వెంటనే కాంట్రాక్టర్‌ను మార్చాలని సభ్యులందరి సంతకాలు తీసుకుని తీర్మానించారు.

గొర్రెల పంపిణీపై ఆరా..

వెటర్నరీ డిపార్ట్‌మెంట్ మండల అధికారిని పిలిచి గొర్రెల యూనిట్ల కోసం యాదవులు ఎంతమంది డీడీలు కట్టారని, ఎన్ని యూనిట్లు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. డీడీలు కట్టిన వారికి ఇష్టం లేకుంటే వారు కట్టిన డబ్బులు తిరిగి ఇచ్చేందుకు అవకాశం ఉందని వారికి చెప్పాలన్నారు. హార్టికల్చర్‌కు సంబంధించిన అధికారి రాకపోవడంతో మరోసారి సర్వసభ్య సమావేశానికి అందరూ హాజరయ్యేలా చూడాలని ఎంపీడీఓ ఉసేనప్పకు సూచించారు. అంగన్‌వాడీలకు సంబంధించి మండలంలో ఎన్ని బిల్డింగులు అవసరమవుతాయో తనకు పూర్తి నివేదిక ఇవ్వాలని, వెంటనే సొంత బిల్డింగులు కట్టిస్తామని చెప్పారు. సర్పంచులు ఇప్పటికే పనులు చేసిన వాటికి డబ్బులు రాని వారికి వారి పదవీ కాలం అయిపోయే లోగా బిల్లులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. డీ–8 మేజర్–2 కాల్వ కింద భూములు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ రఘు, జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కొల్లాపూర్: బాల్య వివాహాలను అరికడదామని గాంధీ హైస్కూల్ హెచ్ఎం శోభారాణి కోరారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాల్యవివాహాల రహిత దేశం కావాలని కాంక్షిస్తూ విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బాల్యవివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో కోనేరు సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు ఉన్నారు.

భూ కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ భరత్‌భూషణ్

కొత్తకోట: పట్టణ కేంద్రంలో సర్వే నంబర్ 362లో గల ఎకరా 17గుంటల ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ నాయకుడు ఆక్రమించుకొని షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేశాడని, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బాధ్యుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని 11వ వార్డు కౌన్సిలర్ భరత్‌భూషణ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని భర్త అయిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.విశ్వేశ్వర్ 362సర్వే నంబర్‌లో గల ఎకరా 17గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నాడని, ఇక్కడ కొన్నేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రి ఉండేదని వివరించారు. తన కుటుంబ రాజకీయ నేపథ్యం దృష్ట్యా పలుకుబడిని ఉపయోగించుకుని ఆ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేశాడని దుయ్యబట్టారు. ఇతడికి పట్టణ శివారులో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు ఉన్నాయని, తను అక్రమించుకున్న భూమికి సమానంగా వేరే చోట స్థలాన్ని ఇప్పించి క్రీడా ప్రాంగాణం కోసం స్థలాన్ని కేటాయించాలని వినతిపత్రంలో కోరారు.

అక్రమంగా బోర్లు డ్రిల్లింగ్ చేయొద్దు

పెద్దకొత్తపల్లి: అక్రమంగా బోర్లు డ్రిల్లింగ్ చేయొద్దని పారా లీగల్ వలంటీర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని పెద్దకార్పాముల రైతువేదికలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో వాల్టా చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 తరువాత బోరు వేసిన తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాలన్నారు. కొత్తగా బోర్లు డ్రిల్లింగ్ రైతులు తహసీల్దార్‌తో పాటు భూగర్భ జలవనరుల శాఖ నుంచి అనుమతి తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో రైతులు యాదగిరి, కృష్ణయ్య, దస్తగిరి, కృష్ణయ్య, భాను, రామస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి



పెబ్బేరు రూరల్: సీఐటీయూ వనపర్తి జిల్లా కార్యాలయంలో ఎం రాజు అధ్యక్షతన సోమవారం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరిందని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని చెప్పడం, 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పడం సంతోషకరమన్నారు. ప్రగతి భవన్‌ను ప్రజా భవనంగా మార్చి ప్రజల గురించి వినతులు స్వీకరించడం శుభ సూచకమన్నారు. వీటితో పాటు అసంఘటిత కార్మికులకు సత్వరం న్యాయం చేయాలని కోరారు. స్కీం వర్కర్లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యన్ రమేష్, గోపాలకృష్ణ, రాము,గందం మదన్,వెంకటేష్,సూరి,దాసు,నందిమల్ల రాములు, ఊశన్న, రంజాన్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోడేరు: మండలంలోని తీగలపల్లి గ్రామానికి చెందిన శివలీల సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎన్వీ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు నక్క వేణుగోపాల్ యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కుర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

అమరచింత: బడిఈడు పిల్లలందరూ బడిలో విద్యను అభ్యసించాలని సీఆర్పీ స్వామి అన్నారు. పట్టణంలో సోమవారం బడి బయటి విద్యార్థుల గుర్తింపు సర్వేను నిర్వహించారు. ఈమేరకు బుడుకలి కాలనీలో నివాసముంటున్న ముస్లిం కుటుంబాలకు వెళ్లి బడి మానేసి ఇంటి పనులు చేస్తున్న విద్యార్థుల వివరాలు తెలుసుకొని వారి తల్లిదండ్రులకు విద్య యొక్క ప్రాధాన్యతను వివరించారు. 14 ఏళ్ల లోపు గల విద్యార్థులతో పనులు చేయిస్తే పోలీసు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తున్నారని తెలిపారు. క్రమం తప్పకుండా విద్యార్థులను బడికి పంపి వారి ఉన్నతికి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. బడిమానిన ముగ్గురు విద్యార్థులను మళ్లీ బడిలో చేర్పించామని సీఆర్పీ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగేంద్రమ్మ, భవిత కేంద్రం టీచర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మధ్యలో బడి మానేసిన పిల్లలను పనులకు కాకుండా తిరిగి పాఠశాలకు పంపాలని, వారు చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. సోమవారం ఆత్మకూర్ మండలంలోని గ్రామాల్లో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

పాన్‌గల్: బడిఈడు పిల్లలతో పనులు చేయించకుండా తప్పక బడికి పంపించాలని సీఆర్పీలు తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం బడి బయటి పిల్లల గుర్తింపులో భాగంగా మండలంలోని మాందాపూర్, బుసిరెడ్డిపల్లిలో సీఆర్పీల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరం అని, వారిని తప్పక బడికి పంపించాలని కోరారు. బడి మానేయడానికి గల కారణాలను తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి పాల్గొన్నారు.



అమరచింతలో బడి మానిన విద్యార్థి తల్లికి అవగాహన కల్పిస్తున్న సీఆర్పీ స్వామి



మాందాపూర్‌లో..



ఖానాపూర్‌లో..

ఓటరు నమోదు చేపట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజు

ఆత్మకూర్: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తహసీల్దార్ రాజు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశమయ్యారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను సేకరించి నమోదు చేయించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని బూత్ లెవల్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్ఐ జయమ్మ, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్ఓలు ఉన్నారు.

అంతర పంటల సాగుపై అవగాహన



మిరప పంట పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

పెబ్బేరు రూరల్: ఆయిల్‌పాం తోటలో అంతర పంటగా మిరపను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందొచ్చని ఏఈఓ నరేష్ రైతులకు వివరించారు. సోమవారం ఆయన మండలంలోని పెంచికలపాడు, జనుంపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో కలిసి మిరపసాగును పరిశీలించారు. మిరపలో బూడిద తెగులు ఆశించిన మొక్కలను గమనించి రైతులకు పలు సూచనలు చేశారు. తెగుళ్ల నివారణ కోసం వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మణ, వెంకటేష్, చిన్న లక్ష్మన్న, జగదీష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పిన్నంచర్లలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి వినయ్‌కుమార్, ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ అబ్బాస్ అలీ అన్నారు. సోమవారం మండలంలోని బాలకిష్టాపూర్, పిన్నంచర్ల గ్రామాల్లో వికసిత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో జన్‌ధన్, సురక్ష, కిసాన్‌సమ్మాన్ యోజన, అటల్‌పెన్షన్, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాల గురించి ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయలక్ష్మి, తుకారాంనాయక్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించడం కోసమే గ్రామాల్లో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని సల్కెలాపురం, వెన్కితండాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎంపీడీఓ విజయ్‌కుమార్‌తో పాటుగా వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో చేపడుతున్న నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, గరీబ్‌కళ్యాణ్ యోజన, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, కిసాన్ క్రెడిట్ కార్డు, అంగన్‌వాడీలో పోషకాహార పంపిణీ తదితర 17 రకాల పథకాల గురించి అవగాహన కల్పిస్తామన్నారు.



సల్కెలాపురంలో ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం దరఖాస్తులు తీసుకుంటున్న వైద్యులు

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



కళశాలతో ఊరేగింపుగా వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

కొత్తకోట రూరల్: అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడిపూజ కార్యక్రమం ఉదయం 4గంటలకు గణపతి హోమంతో ప్రారంభించారు. స్థానిక అంబ భవాని ఆలయంలో అయ్యప్పస్వామికి అభిషేకం చేసి కళశాలను, సుబ్రమణ్యస్వామికి అర్పించే కావడులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి అక్కడి నుంచి డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య శోభాయాత్రగా భూతనాథ అయ్యప్ప అన్నదాన క్షేత్రానికి తరలించారు. అక్కడ గణపతి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్పస్వాములకు పంచామృతాలతో అస్తాభిషేకం చేశారు. శోభాయాత్ర సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా అయ్యప్ప నామస్మరణంతో పట్టణం మార్మోగింది. శోభాయాత్రను చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాయంత్రం 6:30నిమిషాలకు అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్పసేవాసమితి అధ్యక్షుడు దూపం నాగరాజు, అనిల్‌కుమార్, లింగేశ్వర్, భీమ కిషోర్‌కుమార్, గంగాధర్‌శెట్టి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పురుగుల బియ్యంతో అన్నం



హెచ్ఎం కృష్ణయ్యను నిలదీస్తున్న కాలనీవాసులు

గోపాల్‌పేట: విద్యార్థులకు పురుగుల బియ్యంతో అన్నం వండి తినిపిస్తున్నారని రాంనగర్ కాలనీవాసులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని బండపల్లి ప్రాథమిక పాఠశాలలో బియ్యంలో పురుగులను శుభ్రం చేయలేపోతున్నామని వంటవారు స్థానికులకు చెప్పారు. దీంతో వారు పాఠశాలలోకి వెళ్లి చూడగా పురుగుపట్టిన బియ్యాన్ని వంట మనుషులు శుభ్రం చేస్తూ కనిపించారు. ఆగ్రహించిన కాలనీవాసులు విలేకరులకు సమాచారం అందించారు. ఎందుకిలా చేస్తున్నారని పలువురు అడుగగా చాలా రోజులుగా ఇలాగే చేయిస్తున్నారని వాపోయారు. కొత్త బియ్యం తీసుకురారని, బియ్యం తీసుకురావడానికి అయ్యే ఆటో ఖర్చుల డబ్బులు సైతం తమ వద్దే కట్టిస్తారని తెలిపారు. విద్యార్థులకు ఇలాంటి అన్నం పెట్టడం ఏంటని కాలనీవాసులు హెచ్ఎం కృష్ణయ్యను నిలదీశారు. మేము మంచి బియ్యాన్నే వండుతామని బియ్యం అయిపోవడంతో కిందపడిన బియ్యాన్ని ఈ రోజు మాత్రమే వండించానని సమాధానం ఇచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోడేరు: మండల కేంద్రానికి చెందిన పిల్లి నాగరాజు నాగులపల్లి నుంచి కోడేరుకు ఆటోలో సోమవారం రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నాడు. పోలీసుల తనిఖీలో నాలుగు క్వింటాళ్ల 50 కిలోల బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రామ్మోహన్‌కు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ యాదగిరి, విజ్ఞయ్య, లింగస్వామి, రాములు, కుర్మయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.